రోడ్లు అధ్వానం.. ప్రయాణం నరకప్రాయం

- నిత్యం రద్దీగా ఉండే రహదారులూ అధ్వానం
- తరచూ ప్రమాదాలకు గురవుతున్న వాహనాలు
- పట్టించుకోని ఆర్‌అండ్‌బీ అధికారులు

టీ.నరసాపురం: మండల కేంద్రమైన టి.నర్సాపురం చుట్టూ రహదారులు అధ్వానంగా ఉండడంతో ప్రయాణం నరకప్రాయంగా ఉంది. పేరుకే మండల కేంద్రం కానీ ఏ మాత్రం అభివృద్ధికి నోచుకోలేదు. టి.నర్సాపురానికి నాలుగు వైపులా రహదారులు ఏళ్ల తరబడి గోతుల మయంగా ఉండడంతో మండల కేంద్రానికి రావాలన్నా మండల కేంద్రం నుంచి దగ్గరలోని నియోజక వర్గ కేంద్రమైన చింతలపూడి వెళ్లాలన్నా ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని దాదాపు 20 గ్రామాల ప్రజలు వైద్య సహాయం కోసం టి.నర్సాపురం రావాలి.

నిత్యం రద్దీ

ఈ రహదారులు నిత్యం జనంతో రద్దీగా ఉంటాయి. మెరుగైన వైద్యం కోసం చుట్టు పక్కల గ్రామాల వారు ఇటు చింతలపూడి కానీ అటు జంగారెడ్డిగూడెం కానీ వెళ్లాల్సి ఉంది. రహదారులు పూర్తి గోతుల మయంగా ఉండడంతో పావు గంటలో వెళ్లాల్సిన ప్రయాణం గంట పడుతుంది. ప్రధానంగా టి.నర్సాపురం నుంచి చింతలపూడి వరకు పది కిలోమీటర్ల రహదారి పూర్తిగా ధ్వంసమైంది. అలాగే టి.నర్సాపురం నుంచి జంగారెడ్డిగూడెం వెళ్లే రహదారి బొర్రంపాలెం వరకు అధ్వానంగా ఉంది. టి.నర్సాపురం నుంచి మక్కినవారిగూడెం వెళ్లే రహదారి, టి.నర్సాపురం నుంచి బంధంచర్ల వెళ్లే రహదారి గోతుల మయమైంది. టి.నర్సాపురం చుట్టు పక్కల గ్రామాల వారు పండించిన పంటలు వర్జీనియా పొగాకు, పామాయిల్ జంగారెడ్డిగూడెం ప్రాంతానికి తరలించాల్సి ఉంది. చెరుకు తాడువాయికి తరలించాలి. తరచూ ఈ రహదారుల్లో లోడు వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయి. ప్రధానంగా బండి వారిగూడెం అప్పలరాజుగూడెం రహదారి అధ్వానంగా ఉండడం, రోడ్డు మార్గంలో కోతకు గురై ఉండడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు స్పందించి రహదారులను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయాలని పలువురు కోరుతున్నారు.


గోతులమయంగా ఉన్న టి.నర్సాపురం-చింతలపూడి ప్రధాన రహదారి


రహదారిపై నిల్వ ఉన్న వర్షపు నీరు

యుద్ధ ప్రాతిపదికన అభివృద్ధి చేయాలి



మండలంలోని రహదారులను యుద్ధ ప్రాతిపదికన అభివృద్ధి చేయాలి. రహదారుల అభివృద్ధి కోసం గత ఏడాది కాలంగా ప్రజా ప్రతినిధులకు, అధికారులకు ఎన్ని వినతులు సమర్పించినా ప్రయోజనం లేదు. ప్రజల అవసరాలను గుర్తించి రహదారులు మెరుగుపరచాలి.

–ఎస్‌డీ నాజర్‌పాషా, సామాజిక కార్యకర్త, టి.నర్సాపురం

రోడ్లన్నీ అధ్వానంగా ఉన్నాయి



ఏళ్ల తరబడి టి.నర్సాపురం రహదారులు అధ్వానంగా ఉన్నాయి. ఆయా గ్రామాల ప్రజలు వైద్య సహాయానికి సైతం ఇదే రహదారులపై ప్రయాణించాల్సి ఉంది. రైతులు పండించిన పంటలను మార్కెట్లకు తరలించాలన్నా ఈ రహదారులే దిక్కు. రహదారులను యుద్ధ ప్రాతిపదికన అభివృద్ధి చేయాలి.

–గూడెల్లి వెంకట్రావు, సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు

సారా నిందితుల అరెస్టు

జంగారెడ్డిగూడెం: మండలంలోని పలు ప్రాంతాల్లో అక్రమ సారా కలిగిన వ్యక్తులను అరెస్టు చేశామని ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనుబాబు తెలిపారు. సోమవారం డిప్యూటీ కమిషనర్ ఆఫ్ ప్రొహిబిషన్ ఎక్సైజ్, జిల్లా అధికారుల ఆదేశాల మేరకు దాడులు చేశామన్నారు. ఈ సందర్భంగా జంగారెడ్డిగూడెం మండలం పంగిడిగూడెంలో వీరవల్లి శ్రీనివాసరావు వద్ద 5 లీటర్లు, బాలాజీ నగర్‌లో వెలివల కనకరాజు వద్ద 5 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. వీరిని మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచగా రిమాండ్ విధించారన్నారు. ఈ దాడుల్లో ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

రేపటి నుంచి జిల్లా స్థాయి చెస్ పోటీలు

జంగారెడ్డిగూడెం: జిల్లా స్థాయి అండర్ 11 ఓపెన్, బాలికల చదరంగ పోటీలను శ్రీహంస చెస్ అకాడమీ వారి ఆధ్వర్యంలో నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు టోర్నమెంట్ డైరెక్టర్ కన్నా సూర్య నాగేశ్వరరావు తెలిపారు. జంగారెడ్డిగూడెంలోని ప్రతిభ స్కూల్‌లో ఈ నెల 14వ తేదీన పోటీలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఇందులో గెలుపొందిన ఇద్దరు బాలురు, ఇద్దరు బాలికలను ఈ నెల 23, 24 తేదీల్లో గుంటూరులో జరిగే అండర్ 11 రాష్ట్ర స్థాయి పోటీలకు ప్రాతినిథ్యం వహిస్తారని తెలిపారు. అదే రోజున మధ్యాహ్నం 3 గంటల నుంచి ఏలూరు జిల్లా స్థాయి ఓపెన్ బ్లిట్జ్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బ్రిడ్జ్ టోర్నమెంట్‌లో వయస్సుతో ప్రమేయం లేకుండా ఎవరైనా పాల్గొనొచ్చని తెలిపారు.

వైవీ సుబ్బారెడ్డికి సత్కారం


వైవీ సుబ్బారెడ్డిని సత్కరిస్తున్న నాయకులు

జంగారెడ్డిగూడెం: ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల రీజనల్ కో–ఆర్డినేటర్‌గా వైవీ సుబ్బారెడ్డిని నియమించామని మచిలీపట్నం నియోజకవర్గ పరిశీలకులు జెట్టి గురునాథరావు, ఏలూరు జిల్లా కార్యదర్శి ఆర్గనైజేషన్ ముప్పిడి శ్రీనివాస్ అన్నారు. సోమవారం తాడేపల్లిలో ఆయన నివాసంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా గుంటూరు జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు, ఎన్‌టీఆర్ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్, మాజీ మంత్రి మేరుగు నాగార్జున, గుంటూరు పార్లమెంట్ పరిశీలకుడు పోతిన మహేష్, విజయవాడ పార్లమెంట్ పరిశీలకుడు మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి, ఇతర ప్రతినిధులతో కలిసి ఆయనను సత్కరించారు.

క్లుప్తంగా

వైభవంగా మలయప్ప స్వామి కల్యాణోత్సవం


మలయప్ప స్వామి కల్యాణోత్సవం నిర్వహిస్తున్న పండితులు

కొయ్యలగూడెం: శ్రీదేవి భూదేవి సమేత శ్రీమలయప్ప స్వామి కల్యాణోత్సవం సోమవారం కనుల పండువగా నిర్వహించారు. టెంపుల్స్ సెంటర్‌లోని శ్రీరుక్మిణి సత్యభామ సమేత మదన గోపాలస్వామి ఆలయంలో ఉపాలయమైన వేంకటేశ్వర స్వామికి కల్యాణోత్సవ కార్యక్రమాన్ని శ్రీలక్ష్మి హయగ్రీవ లలితా శ్రీపీఠం వ్యవస్థాపకుడు శ్రీ సుదర్శనం రామ దుర్గా కుమారాచార్యులు శిష్య బృందం నిర్వహించారు. తెల్లవారుజాము సుప్రభాత సేవతో పూజలు ప్రారంభం కాగా నిత్య కైంకర్యాలు, నీరాజనం ప్రత్యేక పూజలతో ఉదయాస్తమాన వేళ వరకు శాస్త్రోక్తంగా కల్యాణ క్రతువును భక్త దంపతుల చేతుల మీదుగా చేశారు. అనంతరం అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు.

వైభవంగా వేంకటేశ్వరుని కల్యాణం


స్వామి వారి కల్యాణం నిర్వహిస్తున్న పూజారి

బుట్టాయగూడెం: మండలంలోని కంద్రికగూడెం శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో వైశాఖ పౌర్ణమి సందర్భంగా సోమవారం స్వామివారి కల్యాణ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. పురోహితులు సతీష్ స్వామి వారి కల్యాణాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వెంకన్నబాబు దంపతులు కల్యాణాన్ని నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో షిరిడి సాయిబాబా ఆలయ పూజారి ఆంజనేయులు, భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా సత్యదేవుని కల్యాణోత్సవం


సత్యదేవుని తిరు కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

లింగపాలెం: రాష్ట్రంలో రెండో అన్నవరంగా ప్రసిద్ధి చెందిన రంగాపురం సత్యదేవుడు, భూదేవీ, నీలాదేవీల పరిణయం అంగరంగ వైభవంగా నిర్వహించారు. మంగళ వాయిద్యాలు, వేద మంత్రాలు, బాణసంచా వెలుగుల మధ్య విద్యుత్ దీపాలతో అలంకరించిన స్వామి వారి కల్యాణాన్ని ఆలయ అర్చకులు తిరుమల కాండూరి శేషాచార్యులు ఘనంగా నిర్వహించారు. భక్తులకు ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమాన్ని ద్వారకాతిరుమల వేంకటేశ్వరస్వామి దేవస్థానం అధికారులు పర్యవేక్షించారు. కార్యక్రమంలో దేవాలయ ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

మురళి నాయక్‌కు ఘన నివాళి


మురళి నాయక్‌కి జోహార్లు అర్పిస్తున్న సీఐటీయూ నాయకులు

కొయ్యలగూడెం: ఉగ్రవాదంపై పోరులో అశువులు బాసిన బాసిన మురళి నాయక్ సంస్మరణ కార్యక్రమం సోమవారం జంగారెడ్డిగూడెం రోడ్డులోని సీఐటీయూ కార్యాలయం వద్ద నిర్వహించారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శుకబోయిన రాంబాబు మాట్లాడుతూ ఉగ్రవాదంపై పోరులో అసువులు బాసిన మురళి నాయక్‌తో సహా అమరులైన సైనికులకు భారత జాతి రుణపడి ఉందన్నారు. పీఓకేని స్వాధీనం చేసుకుంటేనే ఉగ్రవాదానికి అడ్డుకట్ట వేయొచ్చన్నారు. అనంతరం సమావేశం నిర్వహించారు. యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు బి.రమేష్, మర్రి సుబ్రహ్మణ్యం, ఎస్.శివకుమార్, పి.తమ్మారావు, ఎం.నాగేంద్ర బాబు, సీహెచ్ మరిడయ్య, కె.దుర్గారావు, కె.నాగరాజు, డి.వీర్రాజు, ఎ.నాగు, ఎ.సతీష్, ఎం.సురేష్, వై.దుర్గారావు, కె.సీతారాములు, త్రిమూర్తులు, తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి క్షేత్రంలో అపచారం

ద్వారకాతిరుమల: క్షేత్రంలో సోమవారం జరిగిన శ్రీవారి రథ పర్యటనలో అపచారం చోటు చేసుకుంది. రథం పర్యటించిన మార్గంలో మాంసం విక్రయించడం వివాదాస్పదమైంది. కొత్త బస్టాండు పక్క రోడ్డులో ఓ వ్యక్తి మాంసం దుకాణాన్ని నిర్వహిస్తున్నాడు.గ్రామంలో మాంసం దుకాణాలు ఉండకూడదని అధికారులు చెప్పినా ఆ వ్యాపారి పట్టించుకోవడం లేదు. సోమవారం కూడా దుకాణం నిర్వహించాడు. స్వామి వారి రథం ఆ దుకాణం మీదుగా వెళ్లడంతో భక్తులు తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు.

మతంగూడెంలో పోలీసుల పల్లె నిద్ర


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

లింగపాలెం: పల్లె నిద్ర కార్యక్రమం ద్వారా గ్రామాల్లో ప్రజలతో సత్సంబంధాలు.పెంపొందించి, శాంతిభద్రతల పరిరక్షణకొరకు పోలీస్ సేవలు ప్రజలకు మరింతగా చేరువచేయడం జరుగుతుందని చింతలపూడి సీఐ సీహెచ్ రాజశేఖర్ తెలిపారు. మతంగూడెం గ్రామంలో ధర్మాజీగూడెం పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ రాజశేఖర్, ధర్మాజీగూడెం ఎస్సై వెంకన్న గ్రామంలో ప్రజలతో ముఖాముఖీ నిర్వహించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామస్తులకు భద్రత, నేర నివారణపై అవగాహన కల్పించారు.అనంతరం పోలీసులు గ్రామంలో పల్లె నిద్ర చేశారు.

సమ్మె జయప్రదం చేయండి

వేలేరుపాడు: ఈ నెల 20న నిర్వహించే దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కార్మిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏఐటీయూసీ, సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ సంఘాల సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల జిల్లా నాయకులు కారం దారయ్య, సీఐటీయూ మడివి దుర్గారావు మాట్లాడుతూ ప్రజా శ్రేయస్సు కోరుతూ చేపట్టిన దేశ వ్యాప్త సమ్మెకు అందరూ మద్దతు పలకాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలతో ప్రజలను అనేక ఇబ్బందులు గురిచేస్తుందన్నారు. సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి ధర్మాల రమేష్, ఏఐటీయూసీ జిల్లా నాయకులు కొవ్వులూరి సైదా, రమాదేవి, వెంకటలక్ష్మి, ఆటో యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు కురిమెల్ల శ్రీను, సీఐటీయూ మండల కార్యదర్శి బోగారి వెంకటేశ్వర్లు, స్వీపర్ల జిల్లా నాయకురాలు పిట్టా ముత్తమ్మ తదితరులు పాల్గొన్నారు.

వాల్ పోస్టర్ ఆవిష్కరణ

జంగారెడ్డిగూడెం: కార్మిక, ఉద్యోగ, రైతు సమస్యలపై ఈ నెల 20న దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి కేవీ రమణ పిలుపునిచ్చారు. సోమవారం ధర్మన్న భవనంలో రాష్ట్ర కమిటీ ముద్రించిన వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా కేవీ రమణ మాట్లాడుతూ దేశంలో కార్మిక వర్గానికి కనీస వేతనం రూ.20 వేలు ఇవ్వాలని భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరణ చేయాలని, ప్రమాద మరణానికి రూ.10 లక్షలు, సహజ మరణానికి రూ.5 లక్షలు, నిర్మాణ కార్మికులకు ఇవ్వాలని కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని కోరారు. యు.ఏసుబాబు, తీయల గణేష్, బాలిన ధర్మరాజు, కోట శివకృష్ణ, డి.శేఖర్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా నాయకులు కారం దారయ్య


వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఐఎఫ్‌టీయూ నాయకులు

వ్యవసాయ కార్మిక సంఘం పిలుపు

నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని చూస్తున్న ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఈ నెల 20న దేశ వ్యాప్త సమ్మె చేస్తున్నామని వ్యవసాయ కార్మిక సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.రవి తెలిపారు. సోమవారం ప్రజా సంఘాల కార్యాలయంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ అన్ని రంగాల్లో పని చేస్తున్న కార్మికులు, రైతులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ కార్మిక సంఘ అధ్యక్షుడు ఎం.జీవరత్నం, ఎస్‌కే శుభాషిణి, పట్టణ అధ్యక్షుడు పి.సూర్యారావు, నాయకులు పాల్గొన్నారు.

మాతృమూర్తికి పాదాభివందనం

జంగారెడ్డిగూడెం: మాతృ దినోత్సవ సందర్భంగా ఇన్నర్ వీల్ రోటరీ క్లబ్ ఆఫ్ జంగారెడ్డిగూడెం గోల్డ్ ఆధ్వర్యంలో పదిమంది మాతృమూర్తులకు పాదాభివందనం కార్యక్రమం నిర్వహించారు. జంగారెడ్డిగూడెంలోని శ్రీమాధవి కంప్యూటర్ ఎంబ్రాయిడరీ టైలరింగ్ సెంటర్‌లో క్లబ్బు అధ్యక్షురాలు నాగ సూర్య మాధురి ఆధ్వర్యంలో కార్యక్రమంలో భాగంగా పిల్లలచే మాతృమూర్తులకు పాదాభివందనం కార్యక్రమం నిర్వహించారు. క్లబ్ ఆధ్వర్యంలో మాతృమూర్తులను శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఇన్నర్వీల్ రోటరీ క్లబ్ ఆఫ్ జంగారెడ్డిగూడెం గోల్డ్ కార్యదర్శి పద్మ జ్యోతి మాట్లాడుతూ ప్రతి రోజూ మాతృ దినోత్సవంగా జీవితాలు ఉండాలన్నారు. ఒక్క రోజుకే పరిమితం కాకూడదని మాధురి పేర్కొన్నారు. కార్యక్రమంలో వెంకటలక్ష్మి, నూలు జ్యోతి సాయి లక్ష్మి, హరి ప్రియ, తదితరులు పాల్గొన్నారు.


మాతృమూర్తులకు పాదాభివందనం చేస్తున్న క్లబ్ సభ్యులు


నిరీక్షణ కుమారికి అవార్డు

జంగారెడ్డిగూడెం: స్థానిక ఏరియా ఆసుపత్రిలో స్టాఫ్ నర్సుగా పని చేస్తున్న మేడిది నిరీక్షణ కుమారి ప్రతిష్టాత్మకమైన ఫ్లోరెన్స్ నైటింగేల్ అవార్డు–2025 అందుకున్నారు. సోమవారం విజయవాడలో నిర్వహించిన కార్యక్రమంలో ఈ అవార్డును అందుకున్నారు. స్టాఫ్ నర్సుగా విధులు నిర్వహిస్తూ విధి నిర్వహణలో నిబద్ధత, వృత్తి నైపుణ్యం చూపినందుకుగాను ఏపీ నర్సు అండ్ మిడ్‌వైజ్ కౌన్సిల్ (ఏపీ ఎంఎన్‌సీ) అవార్డును అందజేసింది. రాష్ట్ర హెల్త్, మెడికల్, అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ మంత్రి వై.సత్యకుమార్ యాదవ్ చేతులు మీదుగా నిరీక్షణ కుమారి ఈ అవార్డును అందుకున్నారు. ఈ అవార్డుకుగాను ప్రశంసాపత్రం, మెమోంటో, రూ.25 వేలు నగదు అందుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర విప్, ఎమ్మెల్యే బొండా ఉమమహేశ్వరరావు, ఎమ్మెల్సీ పి.అనురాధ, ఎమ్మెల్యేలు టీ.సౌమ్య, యార్లగడ్డ వెంకట్రావు, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డీఎస్‌వీఎన్ నర్సింహం, ఏపీ ఎంఎంసీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కే.సుశీల పాల్గొన్నారు.


ఫ్లోరెన్స్ నైటింగ్ అవార్డు అందుకుంటున్న స్టాఫ్ నర్సు మేడిది నిరీక్షణ కుమారి

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

లింగపాలెం: మండలంలోని రంగాపురం జెడ్పీ హైస్కూల్‌లో 2006–2007 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు సోమవారం గెట్ టు గెదర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ మేరకు విద్యార్థులు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకొని, చదువుకున్న సమయంలో వారి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. చదువు చెప్పిన గురువులను విద్యార్థులు సన్మానించారు. ఈ సందర్భంగా స్కూల్‌కు ఒక బీరువా, 10 కుర్చీలు బహూకరించారు.


రంగాపురం హైస్కూల్‌లో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

గిరిజన రైతుల అభివృద్ధికి కృషి

బుట్టాయగూడెం: పోడు వ్యవసాయం చేస్తున్న గిరిజన రైతుల అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తున్నామని కేఆర్‌పురం ఐటీడీఏ ఉద్యాన శాఖ అధికారి బి.శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ గిరిజన వికాస్ సంస్థ సహకారంతో పోడు భూముల్లో చిరు ధాన్యాల సాగు చేపట్టే విధంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని చెప్పారు. ఐటీడీఏ పరిధిలో సుమారు 1000 ఎకరాల్లో సుమారు 1000 మంది గిరిజన రైతులు పలు చిరు ధాన్యాల పంటలు వేసే విధంగా ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి ఉద్యానశాఖ ద్వారా సుమారు 47.14 లక్షల వ్యయంతో 310 మంది రైతులకు వ్యవసాయంలో శిక్షణ ఇవ్వడంతో పాటు తైవాన్ స్ప్రేలను ట్రైకార్ చైర్మన్ చేతుల మీదుగా పంపిణీ చేశామన్నారు. అలాగే తేనె పరిశ్రమలు ఏర్పాటుకు సంబంధించి కూడా కృషి చేశామని చెప్పారు. సుమారు 310 మంది లబ్ధిదారులకు వారి జీవనోపాధికి ఉపయోగపడే విధంగా ఏర్పాటు చేశామని తెలిపారు.


ఉద్యానశాఖ అధికారి శ్రీనివాసరావు

కమనీయం.. శ్రీవారి రథోత్సవం

శ్రీవారి క్షేత్రంలో జరుగుతున్న వైశాఖ మాస దివ్య బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి స్వామి వారి రథోత్సవం కమనీయంగా నిర్వహించారు. క్షేత్ర పురవీధుల్లో స్వామి, అమ్మవార్లు ఊరేగారు. రథోత్సవ కార్యక్రమంలో కోలాట భజనలు, శక్తి వేషాలు, భక్తులను ఆద్యంతం అలరించాయి. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని రథోత్సవాన్ని ఆనందోత్సాహలతో తిలకించారు.

–ద్వారకాతిరుమల


స్వామి, అమ్మవార్లను ఆలయం నుంచి రథం వద్దకు తీసుకెళుతున్న అర్చకులు


వేంకటేశ్వర స్వామి వేషధారణలో..


అలరించిన పలు రకాల వేషధారణలు


కోలాట నృత్యాలు

‘ఉపాధి’ వసతులు కల్పించాలి

కొయ్యలగూడెం: ఉపాధి హామీ పనులు నిర్వహించే శ్రామికులకు పూర్తిగా వసతులు కల్పించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం (బీకేఎంయూ) ప్రధాన కార్యదర్శి కుంచె వసంతరావు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. పరింపూడి గ్రామ పంచాయతీ పరిధిలో సోమవారం ఉపాధి హామీ శ్రామికులు పనులు చేస్తున్న చెరువు వద్దకు సీపీఐ కొయ్యలగూడెం మండల కార్యదర్శి తాడిగడప ఆంజనేయరాజుతో కలిసి ఉపాధి హామీ శ్రామికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వసంతరావు మాట్లాడుతూ ఉపాధి హామీ పనులు చేస్తున్న శ్రామికుల బకాయిలు పది వారాల బకాయిలను శ్రామికుల అకౌంట్‌లోకి వెంటనే జమ చేయాలన్నారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి షేక్ బాజీ, సిపిఐ పార్టీ కార్యకర్తలు, ఉపాధి హామీ శ్రామికులు పాల్గొన్నారు.


ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న వసంతరావు

కాంట్రాక్టర్లతో తునికాకు కూలీల చర్చలు

కుక్కునూరు: తునికాకు కూలీలకు న్యాయమైన రేటు చెల్లించేలా తునికాకు కాంట్రాక్టర్లతో నిర్వహించిన చర్చలు సఫలమైనట్టు సీపీఐ ఎంఎల్ ప్రజా పంథా జిల్లా కార్యదర్శి షేక్ గౌస్ పేర్కొన్నారు. సోమవారం కుక్కునూరు పార్టీ కార్యాలయంలో సీపీఐ ఎంఎల్ ప్రజా పంథా జిల్లా కమిటీ నాయకులు, తునికాకు కాంట్రాక్టర్లతో చర్చించిన అంశాలను ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా గౌస్ మాట్లాడుతూ 2024లో 50 తునికాకుల కట్టకు ప్రభుత్వ రేటుతో కలిపి రూ.3.71 చెల్లించగా ఈ ఏడాది దానిని రూ.3.92 పెంచి అగ్రిమెంట్ చేయించినట్టు చెప్పారు. అంతేకాక కట్టలు పేర్చడం, తెగిపోయిన కట్టలు కట్టడం, లూజింగ్, జట్కాయింపు, లోడింగ్ తదితర పనులకు గతం కంటే అదనంగా 30 శాతం కలిపి ఇచ్చేలా ఒప్పందం కుదుర్చుకున్నట్టు చెప్పారు. ఈ చర్చల్లో అమరవరం, రుద్రంకోట యూనిట్లకు చెందిన తునికాకు కాంట్రాక్టర్ల మేనేజర్లు జి.అనిల్‌కుమార్, ఊకే భద్రయ్య, మౌలానా రియాజ్, సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా డివిజన్ కార్యదర్శి సోయం చందర్‌రావు, కుక్కునూరు కార్య దర్శి కంగాల కల్లయ్య, షేక్ మున్ని, తదితరులు పాల్గొన్నారు.


తునికాకు కాంట్రాక్టర్ల మేనేజర్లతో చర్చలు నిర్వహిస్తున్న సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా నాయకులు